# సహాయ ఆచార్యుల భర్తీకి ఉమ్మడి పరీక్ష

## ఉపకులపతుల సమావేశంలో నిర్ణయం

**అనంతపురం, న్యూస్‌టుడే:** రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో సహాయ ఆచార్యుల భర్తీకి ఉమ్మడి పరీక్ష నిర్వహించాలని శనివారం ఇక్కడ జరిగిన ఉపకులపతుల సమావేశంలో నిర్ణయించారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి వివిధ రకాల ప్రవేశ పరీక్షలను ఆన్‌లైన్‌లోనే జరపాలని తీర్మానించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. రాష్ట్రంలోని 14 విశ్వవిద్యాలయాల్లో తొలివిడతగా 1,104 పోస్టులను భర్తీ చేసుకోవడానికి ఆర్థికశాఖ ఆమోదం తెలిపిందని చెప్పారు. విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తి దెబ్బతినకుండా ఉమ్మడి పరీక్ష నిర్వహించడంపై ఏకాభిప్రాయం వ్యక్తమైందన్నారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి సిద్ధం చేస్తుందని తెలిపారు. బయోమెట్రిక్ హాజరు ఉంటేనే బోధన రుసుములు, ఉచిత సౌకర్యాలు వర్తిస్తాయని తెలిపారు. ఇప్పట్లో డీఎస్సీ నిర్వహించలేమని, ఇప్పటికే 18 మంది పిల్లలకు ఒక ఉపాధ్యాయుడు ఉన్నారని గుర్తు చేశారు. ఎంఈవో పోస్టుల భర్తీ త్వరలోనే కొలిక్కి తెస్తామన్నారు.

## నేడు ఆహార తనిఖీ విభాగం ప్రారంభం

**ఈనాడు, హైదరాబాద్:** పుష్కర ఘాట్లలో అమ్మే ఆహార పదార్థాలు, పుష్కరాల్లో పంపిణీ చేసే ఆహారాన్ని పరిశీలించేందుకు ప్రభుత్వం ఆహార తనిఖీ పుష్కర విభాగాన్ని (ఫుడ్ సేఫ్టీ పుష్కరం సెల్) ఏర్పాటు చేసింది. విజయవాడ పాత ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేసే ఈ విభాగాన్ని ఆదివారం ఉదయం 11.30 రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ ప్రారంభించనున్నారు. ఆహార పదార్థాల విక్రయదారులు ఈ విభాగం వద్ద అనుమతులు పొందాల్సి ఉంటుంది.